
విద్యార్థులకు నోట్ బుక్స్, యూనిఫామ్స్ అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి

## జీవితాలను మార్చేది చదువొక్కటే

బొల్లారం, జూలై 4: విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి మంచి స్థాయికి చేరుకోవాలని బొల్లారం మున్సిపల్ చైర్ పర్సన్ రోజా బాల్ రెడ్డి ఆకాంక్షించారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డ్ బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు నోట్ బుక్స్, స్కూల్ యూనిఫామ్స్ పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సమాజంలో జీవితాలను మార్చేది చదువేనని, చదువుకు కులం, మతం, జాతి అనే తేడాలు ఉండవన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు చైర్‌పర్సన్‌ను ఘనంగా సన్మానించారు. రిటైర్డ్ హెచ్‌ఎం శ్రీధర్, ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

## వీరభద్రేశ్వరాలయంలో వేలంపాట


వేలంపాట నిర్వహిస్తున్న జిల్లా సహాయ కమిషనర్ శివరాజ్

గుమ్మడిదల, జూలై 4: ప్రసిద్ధ శైవ క్షేత్రమైన బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయంలో వాహనాల పార్కింగ్‌కు, అమ్మవారి చీరలు, స్వామి వారి శేష వస్త్రములు, ఒడి బియ్యంకు వేలంపాటను నిర్వహించారు. గురువారం మండలంలోని వీరన్నగూడెంలోని బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో సంవత్సర కాలంపాటు నిర్వహించుకునేందుకు దేవాదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ శివరాజ్, ఈవో శశిధర్‌గుప్తా ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. సంజయ్ రూ.3 లక్షల 20వేలకు పాట పాడి పార్కింగ్‌ను దక్కించుకున్నారు. అమ్మవారి చీరల కోసం, స్వామి వారి శేష వస్త్రముల కోసం ఆర్.పోచయ్య రూ.2 లక్షల 60 వేలకు పాడారు. ఒడి బియ్యం వేలాన్ని హెచ్.సంజయ్ రూ.25 వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నాగేందర్ గౌడ్, మాజీ చైర్మన్ ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వేణు, మాజీ ధర్మకర్త లక్ష్మీనారాయణ, నాయకులు ప్రతాప్‌రెడ్డి, వినోద్, రమేశ్ పాల్గొన్నారు.

## హామీలను వెంటనే అమలు చేయాలి


తహసీల్దార్ భిక్షపతికి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

జిన్నారం, జూలై 4: విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని మండల యువమోర్చా అధ్యక్షుడు ఎల్లేశ్‌యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం జిన్నారం తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ భిక్షపతికి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వంగేటి ప్రతాప్‌రెడ్డి, నర్సింగ్‌రావు, మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, నాయకులు రమేశ్, అశోక్, సుధాకర్, లక్ష్మణ్, రాజభార్గవ, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన చట్టాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సీనియర్ జడ్జి రమేశ్

జిన్నారం, జూలై 4: నూతన చట్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికర సంస్థ సెక్రటరీ, సీనియర్ జిల్లా జడ్జి రమేశ్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం జిన్నారంలోని గిరిజన గురుకుల పాఠశాలలో నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. కెరియర్ గైడెన్స్, సైబర్ క్రైమ్, మాదక ద్రవ్యాల నిర్మూలన, సోషల్ మీడియా నుంచి వచ్చే సమస్యల గురించి వివరించారు. జిన్నారం ఎస్‌ఐ విజయరావు మాట్లాడుతూ షీ టీమ్స్ సేవలను ఉపయోగించుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

## క్వారీల అనుమతులు రద్దు చేయాలి



పీసీబీ అధికారి భద్రగిరీశ్‌కు వినతిపత్రం ఇస్తున్న మాదారం గ్రామస్తులు

జిన్నారం, జూలై 4: మాదారం శివారులోని సర్వేనంబర్ 210లో ఉన్న కంకర క్రషర్లు, క్వారీల అనుమతులను రద్దు చేయాలని గ్రామస్తులు పీసీబీ అధికారులను కోరారు. ఈ మేరకు మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం పీసీబీ సీనియర్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ బీవీ భద్రగిరీశ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఉన్న కంకర క్రషర్లతో అవస్థలు పడుతున్నామని, కొత్తగా చేసుకున్న క్వారీ లీజుకు అనుమతులు ఇవ్వొద్దని కోరారు. ఇండ్లు బీటలు వారుతున్నాయని, ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని తెలిపారు. తక్షణమే కంకర క్రషర్లను శాశ్వతంగా మూసేసి మాదారం గ్రామాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ఆంజనేయులు, రామచందర్, విజయ్‌గౌడ్, రామకృష్ణ, అంబదాసు, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

## 50 పడకలతో దవాఖాన నిర్మించాలి

కోహీర్, జూలై 4: జహీరాబాద్ నియోజకవర్గంలోని పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికుల కోసం 50 పడకల ఈఎస్‌ఐ దవాఖానను నిర్మించాలని జహీరాబాద్ పారిశ్రామిక క్లస్టర్ కన్వీనర్ మహిపాల్ కోరారు. గురువారం మండలంలోని దిగ్వాల్ పిరామల్ పరిశ్రమ కార్మికులతో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతంలో మూడు వేలకుపైగా ఈఎస్‌ఐ కార్డు కలిగిన కార్మికులు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి నర్సయ్య, మల్లేశ్, ప్రభు, ప్రతాప్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీటీసీకి సన్మానం


జడ్పీటీసీని సన్మానిస్తున్న మంత్రి దామోదర

గుమ్మడిదల, జూలై 4: జడ్పీటీసీ చిన్నపాపని కుమార్‌గౌడ్‌ను వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ఘనంగా సన్మానించారు. గురువారం జిల్లా పరిషత్ కార్యాలయ భవనంలో నిర్వహించిన జడ్పీటీసీల ఆత్మీయ వీడ్కోలులో మంత్రి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, మెదక్ ఎంపీ రఘునందర్ రావు, ఎమ్మెల్యేలు సునీతాలక్ష్మారెడ్డి, మాణిక్యరావు శాలువా పూలదండలతోపాటు జ్ఞాపికను అందజేసి ఆత్మీయ వీడ్కోలు తెలిపారని జడ్పీటీసీ తెలిపారు. ఐదేండ్లపాటు ప్రజాసేవ చేసినందుకు సంతోషంగా ఉందన్నారు.

# ఎట్టకేలకు బాగు పడింది

- జోగిపేట దవాఖానలో మెరుగుపడిన సౌకర్యాలు
- కొత్త బెడ్లు ఏర్పాటు క్లీన్ అండ్ గ్రీన్‌గా పరిసరాలు
- స్టాఫ్ నర్స్, శానిటేషన్ కాంట్రాక్టర్‌కు మెమోలు జారీ
- పూర్తి విచారణకు డీసీహెచ్ ఆదేశాలు


జోగిపేట ప్రభుత్వ దవాఖాన


కొత్తగా ఏర్పాటు చేసిన బెడ్లు



టాయిలెట్లు శుభ్రం, మురికి నీరు తొలిగించి బ్లీచింగ్ పౌడర్ చల్లిన దృశ్యం

అందోల్, జూలై 4: పాతబడి పాడైపోయిన బెడ్ల స్థానంలో కొత్త బెడ్లు వచ్చాయి. కంపు కొడుతున్న టాయిలెట్లను శుభ్రం చేశారు. మొత్తానికి జోగిపేట దవాఖాన క్లీన్ అండ్ గ్రీన్‌గా మారింది. గురువారం నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన 'ఆరోగ్య మంత్రి ఇలాకాలో వైద్యానికి సుస్తీ' అనే కథనానికి స్పదించిన అధికారులు చర్యలకు ఆదేశించారు. పాడైపోయిన బెడ్లను తొలిగించి కొత్త బెడ్లను ఏర్పాటు చేశారు. టాయిలెట్లు శుభ్రం చేయడంతోపాటు దవాఖాన మొత్తం క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చారు. మురికి నీరు పూర్తిగా తొలిగించి బ్లీచింగ్ పౌడర్ చల్లి ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా చెత్త బకెట్లు ఏర్పాటు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రమేశ్ గురువారం విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బందితోపాటు రోగులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. స్టాఫ్ నర్సుతోపాటు శానిటేషన్ కాంట్రాక్టర్‌కు మెమోలు జారీ చేసినట్లు చెప్పారు. ఇకపై దవాఖానాలో ఇలాంటి పరిస్థితులు పునరావృత్తం కాకుండా చూస్తామన్నారు. పేషెంట్లు కానీ, వారి బంధువులు కానీ దవాఖాన సిబ్బందికి డబ్బులు ఇవ్వొద్దన్నారు. ఎవరైనా డబ్బులు అడిగినా, దురుసుగా ప్రవర్తించినా తమ దృష్టికి తీసుకువస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. డీసీహెచ్ డాక్టర్ సంగారెడ్డి నమస్తేతెలంగాణతో మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బందిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. బుధవారం రోగుల పట్ల సిబ్బంది వ్యవహరించిన తీరుపై విచారణ జరుగుతుందని, శుక్రవారం మరోసారి పూర్తి విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. శానిటేషన్ కాంట్రాక్టర్‌కు గతంలో కూడా పలుమార్లు హెచ్చరించి మెమోలు జారీ చేశామని.. అయినా వారి తీరు మారలేదని, ఇకపై వారిని బ్లాక్ లిస్టులో పెడుతామన్నారు.


చెక్కును అందజేస్తున్న న్యాల్‌కల్ ఎస్‌బీఐ మేనేజర్ విశ్వేశ్వరయ్య

## బీమాను సద్వినియోగం చేసుకోవాలి

న్యాల్‌కల్, జూలై 4: ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని న్యాల్‌కల్ ఎస్‌బీఐ మేనేజర్ విశ్వేశ్వరయ్య అన్నారు. గురువారం బ్యాంకులో రాయికోడ్ మండలం హుల్గేరా గ్రామానికి చెందిన గడిల సురేశ్ కుటుంబానికి రూ.2 లక్షల బీమా చెక్కును అందజేశారు. బ్యాంకులో అకౌంట్ ఉన్న ప్రతి ఖాతాదారుడు ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పింఛన్ యోజన, ఎస్బీ జనరల్, ఎస్‌బీఐ ఇన్స్యూరెన్స్ హెల్త్ పాలసీలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ మహేశ్‌కుమార్, కరస్పాండెంట్ నర్సింహారెడ్డి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రీస్కూల్ నిర్వహణ సవ్యంగా కొనసాగించాలి

సిర్గాపూర్, జూలై 4: ప్రతి అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ నిర్వహణ సవ్యంగా కొనసాగించాలని ఐసీడీఎస్ పీడీ లలితకుమారి అన్నారు. గురువారం సిర్గాపూర్ రైతు వేదికలో మండలంలోని అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహించనున్న మూడు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇకపై ఎల్‌కేజీ, యూకేజీ వరకు పిల్లలకు విద్యాభ్యాసం కొనసాగించాలన్నారు. దీనిపై టీచర్లకు శిక్షకులు సూచనలిచ్చారు. సీడీపీవో సుజాత, సూపర్‌వైజర్లు సౌమ్య, జమున, సుజాత, అజీమ్, ప్రేమ్‌జీ పాల్గొన్నారు.

## కడుపు నొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

న్యాల్‌కల్, జూలై 4: కడుపు నొప్పి భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రేజింతల్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. హద్నూర్ ఎస్‌ఐ రామానాయుడు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బేగరి నర్సింలు(58) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. గురువారం తెల్లవారుజామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇంటి బయటకు వెళ్లాడు. కడుపు నొప్పి తీవ్రం కావడంతో జీవితంపై విరక్తి చెంది గ్రామ సమీపంలోని చింత చెట్టుకు తువాలుతో ఉరి వేసుకున్నాడు. మృతుడి భార్య భాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

## కరెంట్ షాక్‌లో బర్రెలు మృతి

గుమ్మడిదల, జూలై 4: కరెంట్ షాక్‌తో పాలిచ్చే రెండు బర్రెలు మృతి చెందాయి. గుమ్మడిదల మండలంలోని నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన గేనబోయిన భిక్షపతికి చెందిన రెండు పాలిచ్చే బర్రెలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేస్తుండగా ఎలాంటి కంచె లేకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న కరెంట్ తీగలు తగిలి రెండు బర్రెలు మృతి చెందాయి. వీటి విలువ రూ.లక్షన్నర ఉంటుందని బాధితుడు తెలిపారు. పశు సంవర్ధక శాఖ ఇన్‌చార్జి డాక్టర్ చైతన్య ఘటనా స్థలంలోనే పోస్ట్‌మార్టం నిర్వహించారు. నివేదికను జిల్లా అధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు.

## దొడ్డి కొమురయ్య స్ఫూర్తిని కొనసాగించాలి

**నివాళులర్పించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి**


దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఆర్సీపురం కార్పొరేటర్ పుష్పానగేశ్, కురుమ సంఘం నాయకులు


న్యాల్‌కల్: మల్గిలో నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు



సంగారెడ్డి కలెక్టరేట్: దొడ్డి కొమురయ్యకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 4: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి నేలకొరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య చూపిన స్ఫూర్తిని కొనసాగించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. గురువారం దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతిని పురస్కరించుకొని కలెక్టరేట్ సమీపంలోని దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం తలుచుకోగానే మొదట గుర్తుకువచ్చేది దొడ్డి కొమురయ్య అని పేర్కొన్నారు. తెలంగాణలో భూస్వామ్య పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు, తెలంగాణ సాయుధ రైతాంగ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అన్నారు. వీరుల గాథలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలనే ఉద్దేశంతో వారి జయంతి, వర్ధంతి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీశ్, రామచంద్రపురం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్, మునిపల్లి జడ్పీటీసీ మీనాక్షీసాయికుమార్, కురుమ సంఘం నాయకులు తాటిపల్లి పాండు, కొల్కూరి ప్రవీణ్‌కుమార్, నగేశ్, భూమయ్య, సోమేశ్వర్, పండరి, వెంకట హరికిషన్, పుండరీకం, అశోక్, రాఘవులు, మురళి, యాదగిరి పాల్గొన్నారు.

## ఎంపీపీ, జడ్పీటీసీలకు సన్మానం



ఎంపీపీ శైలజ, జడ్పీటీసీ మీనాక్షిని సన్మానిస్తున్న మంత్రి దామోదర

మునిపల్లి, జూలై 4: మునిపల్లి మండల పరిషత్ అధ్యక్షురాలిగా గౌడిగామ శైలజాశివశంకర్, మునిపల్లి జడ్పీటీసీగా పైతర మీనాక్షీ సాయికుమార్ ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గురువారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఎంపీపీ, జడ్పీటీసీలను ఘనంగా సన్మానించారు. నాయకులు పైతర సాయికుమార్, శివశంకర్ ఉన్నారు.

## లైన్‌మెన్ కుటుంబాన్ని ఆదుకుంటాం


పుల్కల్, జూలై 4: విద్యుత్ షాక్‌తో మృతి చెందిన లైన్‌మెన్ చంద్రశేఖర్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా అన్నారు. బుధవారం అందోల్ మండలం ఎర్రారం శివారులోని ట్రాన్స్‌ఫార్మర్‌కు సాంకేతిక లోపం ఏర్పడడంతో మరో వ్యక్తి మాణిక్యంతో కలిసి మరమ్మతులు చేస్తుండగా అంతలోనే ఒక్కసారిగా ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో చంద్రశేఖర్ అక్కడికక్కడే కింద పడి మృతి చెందిన విషయం తెలిసిందే.. విషయం తెలుసుకున్న వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పెద్దారెడ్డిపేట గ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. డిపార్ట్‌మెంట్ తరపున రూ.15 లక్షలు ఇప్పించడమే కాకుండా కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, తనవంతుసాయంగా మరో రూ.5 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారు. మంత్రివెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుర్గారెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ రాంచంద్రారెడ్డి, నాయకులు అంజయ్య, లింగం, హర్షద్ ఉన్నారు.

## అనారోగ్యంతో ఉద్యమకారుడు మృతి


గుడాల ప్రభాకర్ (ఫైల్)

హత్నూర, జూలై 4: అనారోగ్యంతో తెలంగాణ మలి దశ ఉద్యమకారుడు మృతిచెందిన ఘటన హత్నూర మండలం బోర్పట్ల గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గుడాల ప్రభాకర్(45) తెలంగాణ మలిదశ ఉద్యమంలో చురుకుగా పాల్గొనేవాడని గ్రామస్తులు తెలిపారు. ప్రభాకర్ అనారోగ్యంతో గురువారం మృతిచెందగా పలువురు ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## రోడ్డు ప్రమాదంలో రైతు మృతి


సంజీవరెడ్డి(ఫైల్)

గుమ్మడిదల, జూలై 4: టిప్పర్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలైన రైతు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై మహేశ్వర్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మడిదల మండల కేంద్రానికి చెందిన రైతు సరెడ్డిగారి సంజీవరెడ్డి(60) గురువారం పొలానికి నీరు పెట్టేందుకు వెళ్తే.. కరంట్ లేకపోవడంతో టోల్ ప్లాజా సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లాడు. అక్కడ ట్రాన్స్‌ఫార్మర్ ఫీజులు కాలిపోవడంతో లైన్‌మెన్‌కు సమాచారం ఇవ్వడానికి రోడ్డు పక్కన స్కూటీతో నిల్చున్న సమయంలో నర్సాపూర్ మీదుగా అతివేగంగా వస్తున్న మట్టి టిప్పర్ రైతు సంజీవరెడ్డిని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన గ్రామస్తులు జాతీయరహదారి అంబులెన్స్‌లో సూరారం ప్రైవేటు దవాఖానకు తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతిడి కొడుకు కరుణాకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## డాక్టర్ కిషన్‌రావుకు జాతీయ పురస్కారం



పటాన్‌చెరు, జూలై 4: పటాన్‌చెరు ప్రాంతానికి చెందిన ప్రముఖ పర్యావరణవేత్త డాక్టర్ కిషన్‌రావుకు ఢిల్లీకి చెందిన పౌర సంస్థ క్యాపిటల్ ఫౌండేషన్ సొసైటీ ఎర్త్ కేర్ ఎన్విరాన్‌మెంట్ జాతీయ పురస్కారం ప్రకటించింది. పటాన్‌చెరు పట్టణంలో డాక్టర్‌గా ప్రసిద్ధిలైన కిషన్‌రావు పారిశ్రామికవాడ కాలుష్యంపై ప్రజల్లో అవగాహన కల్పించారు. క్యాపిటల్ ఫౌండేషన్ సొసైటీ జాతీయ అవార్డులకు కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ (సీజీఆర్) పర్యావరణ సంస్థ సభ్యులు ఎంపికయ్యారు. జూలై 6న నల్సార్ యూనివర్సిటీలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏకే పట్నాయక్ అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో అవార్డులను ప్రదానం చేస్తారు. అతిథులుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే హాజరుకానున్నారు. కిషన్‌రావు తీవ్ర అనారోగ్యంతో మండల పరిధిలోని నందిగామలో చికిత్స పొందుతున్నారు. అవార్డును వారి కుటుంబ సభ్యులు స్వీకరిస్తారని పర్యావరణవేత్తలు పేర్కొన్నారు. కిషన్‌రావుకు జాతీయ పురస్కారం రావడాన్ని ప్రముఖ పర్యావరణవేత్త శిల్ప స్వాగతించారు.

## పత్తి పంటల పరిశీలన

గుమ్మడిదల, జూలై 4: మండలంలోని నల్లవల్లిలో గురువారం మండల వ్యవసాధికారి శ్రీనివాస్‌రావు క్షేత్ర స్థాయిలో పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పంటకు రసం పీల్చే పురుగులు సోకే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ పురుగు సోకిన మొక్కలు గిడసబారి చిన్నగా ఉంటాయని తెలిపారు. పెనుబంక, పిండినల్లి సోకే ప్రమాదం కూడా ఉందన్నారు. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఎరువులు తగు మోతాదులో మాత్రమే వాడాలని సూచించారు.

## సాగు భూములకే రైతు భరోసా ఇవ్వాలి

సిర్గాపూర్, జూలై 4: సాగు చేసే భూములకే రైతు భరోసా ఇవ్వాలని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని కడ్పల్ రైతు వేదిక కార్యాలయంలో పీఏసీఎస్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతుల అభిప్రాయ సేకరణ చేపట్టారు. 10 ఎకరాల వరకే ఇవ్వాలని కొందరు, 20 ఎకరాల వరకు సాగు చేసే వారందరికీ రైతు భరోసా ఇవ్వాలని మరి కొందరు చెప్పారు. కార్యక్రమంలో ఖేడ్ ఏడీఏ నూతనకుమార్, ఏవో శశాంక్, ఏఈవో భార్గవచారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ చిన్నారావు, శేషగిరిరావు, నిర్మల, అరుణ్, శ్రీకాంత్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.


దేవుజాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో హరిశంకర్‌గౌడ్

## పటాన్‌చెరు ప్రత్యేకాధికారిగా దేవుజా

పటాన్‌చెరు, జూలై 4: పటాన్‌చెరు మండల ప్రత్యేక అధికారిగా దేవుజా బాధ్యతలు స్వీకరించారు. జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిగా ఉన్న దేవుజా గురువారం ఎంపీపీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో హరిశంకర్‌గౌడ్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

**కార్యదర్శుల బదిలీలు**

పటాన్‌చెరు మండలం పాశమైలారానికి కోహీర్ కార్యదర్శి లక్ష్మణచారీ బదిలీపై వచ్చారు. పాశమైలారం కార్యదర్శి రిజ్వాన్‌ను నందిగామకు బదిలీ చేశారు. నందిగామలో కార్యదర్శిగా సేవలందించిన పద్మావతి రిటైర్ కావడంతో అక్కడ ఖాళీ ఏర్పడింది. రిజ్వాన్ రాకతో నందిగామకు పూర్తి స్థాయి కార్యదర్శి వచ్చారు.

## ఉపాధ్యాయులను నియమించాలని వినతి


జిల్లా విద్యాధికారికి వినతిపత్రం ఇస్తున్న నాగులదేవులపల్లి గ్రామస్తులు

హత్నూర, జూలై 4: హత్నూర మండలం నాగులదేవులపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని గ్రామస్తులు గురువారం జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లుకి వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో 8వ తరగతివరకు 98 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ ఇద్దరు మాత్రమే ఉన్నారన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగునంగా ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయులను నియమించి పేద విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రతినిధుల సేవలు మరువలేనివి


ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలతో ఎంపీ సురేశ్‌షెట్కార్, ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఝరాసంగం, జూలై 4: ప్రజా ప్రతినిధుల సేవలు మరువలేనివని జహీరాబాద్ ఎంపీ సురేశ్‌షెట్కార్, ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం ముగియడంతో గురువారం మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎంపీ, ఎమ్మెల్యేతోపాటు ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, మాజీ ఎంపీపీ హన్మంత్‌రావు పాటిల్, అధికారులు పూలమాల శాలువాలతో వారిని సన్మానించి జ్ఞాపికను అందించారు. అనంతరం నిమ్జ్ భూ నిర్వాసితులతో సమావేశమై పట్టాతో సమానంగా ప్రభుత్వ భూమికి నష్టపరిహారం అందిచేలా కృషి చేస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రి చంద్రశేఖర్, జడ్పీటీసీ వీనీల నరేశ్, ఎంపీపీ దేవాదాస్, తహసీల్దార్ సంజీవరావు, ఎంపీడీవో సుధాకార్, ఎంపీటీసీలు, అయా శాఖల అధికారులు, నిమ్జ్ నిర్వాసితులు ఉన్నారు.